# అమృతఫలాలు

కాకాని కమల



ఎఱ్ఱంనాయుడు కఱ్ఱపోటు వేసుకుంటూ పొలం గట్టుమీదికి వచ్చి కూర్చున్నాడు!

కాంతి కాల్పోయి గాజు గోళాల్లా వున్న కనుగుడ్లు పల్చని నీటిపొర కమ్మి మసక బారుతుంటే ఆ మసకలోంచి ఎదురుగా వున్న తన బొంత అరటి తోటకేసి అలా దిగాలుపడిచూస్తూ వుండిపోయాడు!

ఎదురుగా అరటితోట పండిన గెల్లతో నిండు గర్భిణిలా ఉంది. పంట దిగుబడి శానా బాగుంది. ఈ ఏడాది తోటమీద లాభాలే వస్తాయి. కాని ఎఱ్ఱం నాయుడి మనసు సంతోషంగా లేదు. గెల వెయ్యని అరటి చెట్టులా తనని తనే అసహ్యించుకుంటూన్నట్లు దిగులుగా ఉన్నాడు!

దాదాపు రెండువందల దాకా అరటి చెట్లున్న ఆ తోటలో కూర్చున్న చోటనుంచి కదలలేకుండా ప్రతి చెట్టుని అంగుళం అంగుళం తన చూపులతోనే పరామర్శిస్తున్నాడు! ప్రతి చెట్టులో కొడుకు వెంకటరమణే కనిపిస్తున్నాడు! చెట్ల ఆకులు కదలాడినప్పుడల్లా "నాన్నా" అని పిలుస్తున్నట్లు ఉలిక్కిపడుతున్నాడు! ఎందుకంటే ఈ అరటితోటని ఇష్టంగా పెంచింది వెంకటరమణే!

"ఎలాగైనా ఈసారి అరటితోట వేద్దాం నాన్న. ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ వేస్తే మంచి లాభాలు వస్తాయి" అంటూ హైబ్రీడు రకం బొంత అరటిపండ్ల పిలకలు నాటాడు వెంకటరమణ.

"నిజమేగాని బిడ్డా! చిన్న గాలి వాన వచ్చినా చెట్టు తట్టుకోలేదురా! గెల్లు ఇరిగిపోతాయి" అన్నాడు నాయుడు!

"అదేం లేదులే అయ్యా! చెట్టు చెట్టుకి బలమైన గెడల సపోర్ట్ ఇద్దాం" అంటూ తన పంతం నెగ్గించుకున్నాడు!

కొడుకు ఉత్సాహం చూసి కాదనలేకపోయాడు ఎఱ్ఱంనాయుడు! కనురెప్పలా తోటని పెంచాడు వెంకటరమణ. తోట కాపుకి వచ్చింది.

పెద్ద పెద్ద గెలలతో చెట్లు నిండు గర్భిణిల్లా ఉన్నాయి. బొంత అరటిపళ్ళు బంగారం ముద్దల్లా పచ్చగా మెరిసిపోతున్నాయి. "అమృత పాణీలు"... నోరూరించే మధుర ఫలాలు... చూడగానే నోట్లో పడేసుకోవాలనిపించే ఆ పళ్ళు ఎఱ్ఱంనాయుడికి రుచించటం లేదు. చేదు ఫలాల్లా అనిపిస్తున్నాయి.

ప్రతి చెట్టులో ప్రతి పండులో ఆ తోట అంగుళం అంగుళంలో కొడుకు వెంకటరమణ రూపమే కనిపిస్తుంది. చెట్టు చెట్టుకి బోదెలు తవ్వుతూనో, గెడలు నిలబెడతూనో, అరటిగెల్లకి గోనె సంచాలు బిగిస్తూనో బిడ్డ తోటంతా తిరుగుతున్నట్లే అనిపిస్తోంది ఎఱ్ఱంనాయుడికి.

నెమ్మదిగా లేచి చేతి కఱ్ఱ అందుకుని తోటలోకి వచ్చాడు ప్రేమగా అరటి చెట్లని అరచేత్తో నిమిరాడు. రెండు చేతుల్తో ఆ చెట్లని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. "కొడుకా" అంటూ గొడ్డులా అరిచాడు. గెల నరికిన చెట్టులా కూలబడిపోయాడు.

భుజం మీది తుండుని ముఖం మీదికి లాక్కొని ఆడదానిలా భోరుమన్నాడు.

పక్కనే గలగలా పారుతున్న పంటకాల్వ కంటె ఎక్కువగా ఎఱ్ఱం నాయుడి కన్నీరు వలవలా చెంపల మీద కాల్వలైంది. అరవైఏళ్ల వయసు ఎఱ్ఱం నాయుడుకి.

అప్పటికింకా పూర్తిగా తెల్లవారలేదు!

ఆ తొలి వేకువలో ఆ చీకటి వెలుగుల మధ్య ఒంటరిగా ఒక్కడే తోటలో కాల్వ పక్క కూర్చుని కుమిలిపోతున్నాడు. ఎఱ్ఱంనాయుడు గోడు అరణ్యరోదనగా అయ్యింది. ఇంకా రైతు కాపు లెవరూ పొలాలకి రాలేదు. చెట్లనిండా చేరిన పక్షులు రెక్కలు సాచి నింగికి ఎగురుతున్నాయి.

భోరు భోరుమంటూ మధ్య మధ్య "బిడ్డా" అంటూ ఏడుస్తున్న ఎఱ్ఱంనాయుడి దుఃఖానికి బెదిరినట్లు గూళ్ళలోని పక్షులు కూడా రెక్కలు పటపట కొట్టుకుంటూ నింగికి ఎగిరిపోతున్నాయి. పదిరోజుల క్రితం రైతు సదస్సుకి వెళ్ళి కాల్దారి రైతు ధర్నాలో పాల్గొన్న ఎఱ్ఱంనాయుడు చెట్టంత

కొడుకు ఒక్కగానొక్క కొడుకు వెంకటరమణ పోలీసు కాల్పుల్లో అక్కడి కక్కడే మరణించాడు! లాఠీ దెబ్బకి ఎర్రంనాయుడు కుప్పకూలిపోయాడు. ముసలాళ్ళని వెనక్కి నెట్టి యువత ముందు నిల్చున్నారు ధర్నాలో. వ్యవసాయం చదువు చదివినవారు కావడంతో వెంకటరమణ ధర్నాలో మరీ ముందు వరసలోనే వుండడంతో తుపాకి గుండు అలా కణతల్లోంచి దూసుకుపోయి నిలువునా కూలిపోతూ "అమ్మా" అన్న కేక పూర్తిగా అతని నోటినుంచి రాకముందే అతని ప్రాణం గాల్లోకి ఎగిరిపోయింది. అంతలోనే మరో రెండు తూటాలు అతని ఎడమ ఛాతీలోంచి దూసుకుని పోయి చచ్చిన వాణ్ణి మరింతగా చంపాయి. ఎర్రంనాయుడు లాఠీ దెబ్బనుంచి తేరుకుని కొడుకుని చూచుకునేసరికి వెంకటరమణ రక్తం ముద్ద అయ్యాడు. అప్పటికే అలాంటి నెత్తురు ముద్దలతో, కాలో-చెయ్యో తెగిన క్షతగాత్రులలో అబ్బా-అమ్మా అన్న ఆర్తనాదాలతో ఆ రైతుసదస్సు రణరంగాన్ని తలపిస్తోంది!

అంబులెన్సులు వచ్చాయి!

గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించారు.

కాని వెంకటరమణకి ఆ అవసరం రాలేదు.

ఇక నువ్వు పొలం పన్లు మానేసి ఇంటి పట్టునుండి పాడి పశువుల్ని చూసుకో. పొలం తోట వ్యాపారం నాకొదిలెయ్యి" అన్న కొండంత కొడుకు మాటలే ఎర్రంనాయుడికి ఇంకా చెవుల్లో మారుమ్రోగుతున్నాయి.

పంతం పట్టి రెండు ఎకరాల్లో అరటి తోటలు వేసి జిల్లా మొత్తంలో దిగుబడి తమదే ప్రథమస్థానంలో వుండాలని చెమట పోసి అరటి తోటని పోషించాడు వెంకటరమణ. కొత్తగా పెళ్ళయింది. కొడుకు పుట్టాడు. వాడికి ఇప్పుడు పదినెల్లు. అరటి తోటమీద వచ్చే లాభంతో మామిడి తోట కొంటానన్నాడు. దానిమీద వచ్చే లాభంతో కొత్త ఇంటి కప్పు వేయిస్తానన్నాడు. బాపట్ల వ్యవసాయ కళాశాల్లో నాలుగేళ్ళు చదివిన చదువుకి సార్థకత చూపిస్తానన్నాడు. పదెకరాల్ని పాతికెకరాలు చేస్తానని తండ్రితో సవాలు చేశాడు. "నీది పాతకాలం వ్యవసాయం. నేను కొత్త పద్ధతుల్లో వ్యవసాయం చేస్తాను చూడు" అన్నాడు! కాని ఏదీ చూపించకుండానే వెళ్ళిపోయాడు.

ఎర్రంనాయుడు మనసు కలకలమంది!

"నాయనా.... కొడకా..." అంటూ గొంతెత్తి ఓ వెర్రి ఏడుపు...దుఃఖం...గుండెల్లో సుళ్ళు తిరుగుతున్న వేదన.... మనసు బరువైపోతూ..... ముడుతలు పడ్డ చెంపల మీద కన్నీరు ఆగి ఆగి జారుతూంది!

అరవైఏళ్ళ వృద్ధాప్యం...అపురూపంగా గుండెలో పుత్ర ప్రేమని పదిల పరుచుకున్న ఆ తండ్రి హృదయం.... కొడుకు అకాల మరణం తట్టుకోలేకపోతోంది!

తల ఎటు తిప్పినా నిండు గెల్లతో వున్న అరటితోట శ్మశానంలా కనిపిస్తోంది. ఎర్రటి అరటి పూలు నెత్తురు ఓడుతున్న కొడుకు శవంలా ఉన్నాయి. మళ్ళీ రెండు చేతుల్తో గుండెలమీద కొట్టుకుంటూ బావురుమన్నాడు.

"అయ్యా....ఎంకటి....ఆ పాపిట్టి గుండ్లు నాకన్న తగలకపొయ్యాయా? అయ్యా నువ్వు లాఠీ దెబ్బకి తట్టుకోలేవు ఎనకుండు అని నన్నా ఎనకాల నిలుచుండ బెట్టింది ఇందుకంటరా అయ్యా నాయనా ఎంకటి.... నిన్ను పాతికేళ్ళు పెంచింది బుగ్గిపెట్టడానికా... అరచేత్తో గుండెలు బాదుకుంటున్న ఎర్రంనాయుడికి జేబులో బరువుగా కాగితాలు తగిలాయి.

ఒణికే చేతుల్తో ఆ కాగితాలు బయటికి తీశాడు. కాల్దారి రైతు సదస్సులో జరిగిన అల్లర్లలో పోలీసు కాల్పుల్లో మరణించిన వారికి ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రభుత్వం ఇచ్చిన లక్షరూపాయల చెక్కు. వెంకటరమణ మరణానికి గాను సానుభూతిగా ఇచ్చిన ఎక్స్ గ్రేషియా.

ఆ చెక్కు చూస్తూనే ఎర్రంనాయుడి కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా అయ్యాయి.

ఆ చెక్కు డబ్బులులా కాక ఎర్రగా నెత్తురు ఓడుతున్న కొడుకు మృతదేహంలా అనిపించింది.

కసిగా ఆ కాగితాన్ని చెక్కుని పరపరా ముక్కలు ముక్కలుగా చేసి పంట కాల్వలోకి విసిరాడు.

## ఇదిగో తెల్లపులి!



పులుల వంటి గంభీరమైన, హుందాగావుండే అందమైన జంతువులు లేవు. వాటిని మించినవి తెల్లపులులు. ప్రపంచంలో బహు స్వల్పంగా ఉన్నవి ఈ శార్దూలాలు. ఇదిగో ఆ తెల్లపులిని చూడండి! 3 మీటర్ల పొడవుగా ఉన్న దీని బరువు 183 కేజీలు! ఆస్ట్రేలియాలోని తరోంగా జూలో, సందర్శకులకు ఇది ఓ ప్రత్యేక ఆకర్షణ. ప్రపంచం మొత్తంలో ప్రస్తుతం ఓ వంత తెల్ల పులులు మాత్రమే ఉన్నవట. తతిమా వాటిని నరరూప రాక్షసులైన పులిహంతకులు, వాటి అద్భుతమైన చర్మాలకోసం నిలువునా చంపేసి ఉంటారు!

- కొడిమెల

లేచి బోదె దగ్గరికి వెళ్ళి నీళ్ళలోకి చూస్తూ కొడుకా అంటూ ఓ వెర్రి కేక పెట్టాడు. దిక్కులు పిక్కటిల్లినట్లు ఆ కేక ఊరుచివరి పంటపొలాల్లోంచి ప్రతిధ్వనించింది.

వేపపుల్లతో పళ్ళు తోముతూ అప్పుడే తన పొలం గట్టుదగ్గరికి వచ్చిన నర్సయ్య ఎర్రంనాయుడు పెట్టిన కేకకి అదిరిపడినట్లు తల తిప్పాడు.

ఎత్తైన పంట బోదె గట్టు మీంచి తల్లక్రిందులుగా పంట కాల్వలోకి జారిపోతున్న ఎర్రంనాయుడు కనిపించాడు.

"అర్రెర్రె.................. ఓరి నారిగ.... చిట్టిగా... ఒర్రే...వీరిగా..." అంటూ పొలికేకలు పెడుతూ పొలం గట్లమ్మట పరిగెడుతూ పంట బోదె దగ్గరకి వచ్చాడు.

చిత్తడిగా వున్న బంకమట్టిలోంచి నీళ్ళలోకి పూర్తిగా జారిపోయాడు ఎర్రంనాయుడు. లోతైన కాల్వలో మనిషిలోతు నీళ్ళలో మునకలు వేస్తున్నాడు.

ఖాళీ పాల చెంబుల్తో అప్పుడే పశువుల పాకల్లోకి వస్తున్న పాలెగాళ్ళు, పొలాల్లోకి దిగుతున్న రైతన్నలు నర్సయ్య కాపు పొలికేకలకి చేతుల్లో పని ఒదిలి పొలాల్లోంచి అడ్డదిడ్డంగా పరిగెడుతూ కాల్వబోదె చుట్టూ మూగారు. లంగరు తెగిన తెడ్డులా నీళ్ళల్లో పైకి కిందికి తేలుతున్నాడు నాయుడు.

నల్గురూ చేరి ఎర్రనాయుణ్ణి ఒడ్డుకి తెచ్చారు.

అప్పటికే ఎర్రనాయుడి ఒళ్ళు రాయిలా మారింది.

దవడలు బిగుసుకుని నోరు తెరుచుకుంది. కళ్ళు శాశ్వతంగా మూతలు పడ్డాయి.

"కొడుకా..." అన్న వెర్రి కేకతోనే ఊపిరిపోయింది. బతికున్నప్పుడే ఎర్రంనాయుడి గుండె రాయిలా అయ్యింది. ఇంక చచ్చాక అవదా?

ఈ రైతు ఉద్యమం ఈనాటిది కాదు. (హా....కలి) ఆకలి తాళలేక నాగలి కొర్రా భుజాన ఎత్తిన నాటినుంచే రైతు గుండె మండుతునే వుంది. ప్రకృతి మాతపై ఆధారపడినప్పుడు ఆక్రందన చేస్తున్నాడు. రైతే దేశానికి వెన్నెముక రైతే రాజు అంటూనే రైతుని రెండోరకం పౌరుడిగా జమకట్టినప్పుడు నుంచి రైతు బతుకులో మంట రగలటం మొదలయ్యింది. 1923లో గుంటూరు పశ్చిమ గోదావరి జిల్లాల్లో రైతు సంఘాలు ఆవిర్భవించిన నాటినుండి ఆ రైతు సంఘం ఏదో ఒక సందర్భంగా ఉద్యమిస్తునే ఉంది. నిన్నటిదాకా భూమిని చెమటతో తడిపి పంట పండించిన రైతు నేడు నెత్తురు తడిపే స్థితికి వచ్చాడు. అమృత ఫలాలు పండవలసిన నేలలో మృత ఫలాలు పండుతున్నాయి. ❋